

మల్లాపూర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

# కాపాడే కేసీఆరా.. సున్నం పెట్టే కాంగ్రెస్సా?

- ఎవరూ కావాలో ప్రజలారా ఆలోచించండి
- కాంగ్రెస్, బీజేపీని నమ్మితే అరిగోసే
- చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- గంగాధర మండలంలో ఇంటింటా ప్రచారం
- స్వాగతం పలికిన మహిళలు, గ్రామస్తులు



మల్లాపూర్‌లో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె

గంగాధర, నవంబర్ 1 : తెలంగాణ ప్రజలను కడుపులో పెట్టుకొని కాపాడుకునే కేసీఆర్ కావాలో..? అబద్ధపు హామీలతో సున్నం పెట్టే కాంగ్రెస్ కాంగ్రెస్, బీజేపీలో కావాలో..? ప్రజలారా మీరే ఆలోచించాలని చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓటు వేస్తే కర్ణాటక రైతుల మాదిరిగా అరిగోస పడుతామని, అర్ధరాత్రి సమయంలో పొలం కాడికి పోవడానికి టార్చిలైట్లు కొనుక్కోవాల్సిన దుస్థితి వస్తుందన్నారు. రైతుబంధు వద్దని, మూడు గంటల కరెంట్ చాలని చెప్పే కాంగ్రెస్‌తో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే సీఎం కేసీఆర్‌ను మరచిపోవద్దని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. గంగాధర మండలంలోని తాడిజెర్రి, రంగరావుపల్లి, గోపాల్‌రావుపల్లి, మల్లాపూర్ గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ ప్రచారం చేశారు. ఆయాగ్రామాల్లో ర్యాలీ తీసి గ్రామస్తులను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మహిళలు, సర్పంచులు, గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించి ఘన స్వాగతం పలికారు. ఆయాచోట్ల సుంకె రవిశంకర్ మాట్లాడారు. కాంగ్రెస్‌ది కుర్చీలాట అని, బీజేపీది మత రాజకీయమని, బీఆర్ఎస్‌ది ప్రజా సంక్షేమమని పేర్కొన్నారు. ₹1800 కోట్లతో చొప్పదండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, పల్లెలను మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. బీఆర్ఎస్ జోరుకు ప్రతిపక్షాలు బేజారవుతున్నాయని ఎద్దేవా చేశారు. ఐదు గ్యారెంటీలతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయకుండా చేతులెత్తేసిందని విమర్శించారు. కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధును బంద్ చేయాలని ఈసీకి లేఖ రాశాడని దుయ్యబట్టారు. 'జన్‌ధన్ ఖాతా కోలో.. హమ్ ధన్‌ధన్ పంద్రా లాక్ దాలేంగే' అన్న ప్రధాని మోదీ 15 పైసలు కూడా జమచేయలేదని ఎద్దేవా చేశారు. ఎంపీగా గెలిచిన బండి సంజయ్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో వచ్చి అబద్ధపు ప్రచారాలు చేసే వారిని నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుల్కం అనురాధానర్సయ్య, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, ఆర్బీఎస్ మండల కో-ఆర్డినేటర్ పుల్కం గంగన్న, వైస్ ఎంపీపీ కంకణాల రాజ్‌గోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ వేముల భాస్కర్, పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, సర్పంచులు రామిడి కనకమ్మ, పాశం స్వప్నకుమార్, రాసూరి మల్లేశం, ఆకుల శంకరయ్య, కంకణాల విజేందర్‌రెడ్డి, మడ్లపెల్లి గంగాధర్, వేముల దామోదర్, ఎంపీటీసీలు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బలవంతంగా కండువా కప్పారు

- నేను బీజేపీలో చేరలేదు
- నేరెళ్ల జ్యోతక్క



నేరెళ్ల జ్యోతక్క

కోనరావుపేట, నవంబర్ 1: తాను బీజేపీలో చేరలేదని, బలవంతంగా పార్టీ నాయకులు కండువా కప్పారని నేరెళ్ల జ్యోతక్క (మాజీ మావోయిస్టు నేత) స్పష్టం చేశారు. కోనరావుపేట మండలం శివంగాళపల్లిలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. శివంగాళపల్లిలో బీజేపీ నిర్వహించిన సమావేశానికి కొందరు సన్నిహితులు ఆహ్వానిస్తే అక్కడికి వెళ్లానని చెప్పారు. అయితే కొందరు మాత్రం తాను బీజేపీలో చేరినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దీనిని ఆమె ఖండించారు. 19ఏండ్లు మావోయిస్టు సిద్ధాంతాలకు అనుగుణంగా కట్టుబడి పని చేశానని గుర్తు చేశారు. త్వరలోనే తాను ఏపార్టీలో చేరుతాననేది ప్రకటిస్తానని చెప్పారు.

# రామన్నకే పట్టం కడుదాం

- అభివృద్ధి ప్రదాతను ఆశీర్వదిద్దాం
- లక్ష మెజార్టీతో గెలిపించుకుందాం
- సిరిసిల్లలో బీఆర్ఎస్ నేతల ప్రచారం
- వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు
- ఇంటింటికీ వెళ్లి ఓట్ల అభ్యర్థన



మంత్రి కేటీఆర్‌కు మద్దతుగా సిరిసిల్ల పట్టణంలో ఓట్లు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబర్ 1: సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మంత్రి కేటీఆర్‌కే మరోసారి ఓటేసి పట్టంకడుదామని సిరిసిల్ల బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో సిరిసిల్లలో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ మేరకు స్థానిక శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని పెద్దబజార్, గాంధీచౌక్, అంబేద్కర్‌చౌక్ మీదుగా ఎన్నికల ప్రచారం చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ వివరిస్తూ, మ్యానిఫెస్టో పత్రాలను అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడారు. తొమ్మిదిన్నర ఏండ్ల కాలంలో సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి చేశారన్నారు. మంత్రి కేటీఆర్ నాయకత్వంలో సిరిసిల్ల నియోజకవర్గం విద్యా, వైద్య ఉపాధి రంగాల్లో ముందువరుసలో నిలిచిందన్నారు. కేటీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి మన కండ్ల ముందే కనిపిస్తుందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్తున్న క్రమంలో ప్రజల నుంచి అపూర్వమైన స్పందన లభిస్తున్నదన్నారు. 'మా ఓట్లన్నీ కారు గుర్తుకే.. కేటీఆర్ సార్‌కే' అంటూ ప్రజలు సంతోషంగా చెబుతున్నారన్నారు. ఈ సారి మంత్రి కేటీఆర్‌కు లక్ష మెజార్టీ పక్కా అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఆర్బీఎస్ జిల్లా కన్వీనర్ గడ్డం నర్సయ్య, సెస్ డైరెక్టర్లు దార్నం లక్ష్మీనారాయణ, దిడ్డి రమాదేవి, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మల్యాలలో బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం



ఓటు అభ్యర్థిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

మల్యాల, నవంబర్ 1: మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు చొప్పదండి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్‌ను గెలిపించాలని ప్రచారాన్ని నిర్వహించారు. రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాయకులు ప్రచారం నిర్వహించి మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి రవిశంకర్‌ను ఎమ్మెల్యేగా, కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా ప్రజలు ఆశీర్వదించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, సర్పంచ్ సుదర్శన్, ఆర్బీఎస్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆసం శివకుమార్, ఉప సర్పంచ్ పోతురాజు శ్రీనివాస్, నాయకులు మంద నాంపల్లి, యాగండ్ల సుమన్, గడ్డం రాజేశ్వర్‌రెడ్డి, కాలికంటి స్వామి, బొల్లారపు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశీర్వదిస్తే మీ వెన్నంటే ఉంటా..

- మీ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా
- బీఆర్ఎస్ వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు
- పట్టణంలోని 19, 20 వార్డులో ఇంటింటా ప్రచారం



గాంధీ నగర్ లో ఏర్పాటు చేసిన సభలో శంఖం ఊదుతున్న బీర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, నవంబర్ 1: మీరు ఆశీర్వదించి అసెంబ్లీకి పంపితే.. మీ వెన్నంటే ఉండి మీ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 19, 20 వార్డులలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్ కుమ్మరి శిరీషతో కలిసి ఆయన ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు. గాంధీనగర్‌లోని హనుమాన్ ఆలయం వద్ద జరిగిన సభలో మాట్లాడారు. 60ఏండ్ల కాంగ్రెస్ పాలనలో జరిగిన నష్టకష్టాలను స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దేశంలోని రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమంలో ప్రథమ స్థానంలో నిలిపారన్నారు. ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన సీఎం కేసీఆర్ సౌభాగ్య లక్ష్మి ద్వారా మహిళలకు రూ.3వేల జీవనభృతి, దివ్యాంగులకు ఆసరా పెన్షన్ రూ.5,016, కేసీఆర్ ఆరోగ్య రక్ష పేరుతో 15 లక్షల రూపాయల వైద్య సదుపాయాన్ని పెంపొందించడమే కాకుండా ప్రతి ఇంటికి 5 లక్షల రూపాయల బీమా పథకాన్ని కూడా ప్రవేశపెట్టబోతున్నారని చెప్పారు. వేములవాడను కూడా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు పుల్కం రాజు, పట్టణ రైతుబంధు సమన్వయ సమితి అధ్యక్షుడు మల్లేశం, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి రామ్ చందర్, కోఆప్షన్ సభ్యులు బాబున్, నాయకులు రామతీర్థపు రాజు, కుమ్మరి శ్రీనివాస్, కందుల క్రాంతి కుమార్, కొండ నర్సయ్య, గూడూరు మధు, ముద్రకోల వెంకటేశం, నీరటి మల్లేశం, అక్రమ్ పాషా తదితరులున్నారు.

## తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం అందిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

కొడిమ్యాల, నవంబర్ 1: మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై ఇటీవల కత్తితో దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల కేంద్రంలో తహసీల్దార్ రవికాంత్‌కు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్ విండో చైర్మన్ మేన్నేని రాజనర్సింగరావు, రైతు బంధు సమితి మండల కన్వీనర్ అంకం రాజేశం, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.